# అర్థంకాని హృదయం

రచన: శ్రీ వై. వెంకటబలరాం.

[గత సంచిక తరువాయి]

"దీని గురించి చెప్పాలంటే చిన్న కథ వుందిలే... ఒక బస్సు యాక్సిడెంట్‌లో దెబ్బ తగిలింది. దానికి కుట్లు పడినాయి. ఆ గీతే యిలాగ వుండిపోయింది." సాధారణ విషయంలా అన్నాను.

"అరే!...నీకు యాక్సిడెంట్ అయిందా! నాకెప్పుడూ వ్రాయలేదే...ఏం? ఎందుకు వ్రాయలేదు? ఏమిటో ఆ కథ మేం వినకూడదా" అన్నాడు పరమేశ్ ముఖంలో ఆశ్చర్యము కనిపించింది.

"ఆ...ఏం లేదు. నీకు వ్రాస్తే బాధపడతావని వ్రాయలేదు. ఆ కథ అనేకన్నా ఆ వ్యథ అంటే బాగుంటుందనుకుంటాను. అదే నాజీవితములో క్రొత్త అభిరుచుల లోనికి దారి తీసిన ప్రేమ కథ. దీని సాధారముగ చేసే నీవు చదివిన కథ వ్రాసేను."

"అయితే నీ క్రొత్త అనుభవాలు వినే భాగ్యము నాకు కలిగించవలసిందే. నేను విని తీరాల్సిందే. ఇంక దాచేయక చెప్పరా నీ కథ. కాదు కాదు నీ వ్యథ" అన్నాడు.

"సరే—నేను చెబుతాను గాని, మధ్యలో నీ వెటువంటి అనుమానాలు వెలిబుచ్చక, చెప్పినదంతా విను" అన్నాను.

సరే అన్నట్లు తల యూపేడు. అన్ని ఎగ్రిమెంట్స్ లోకి పరమేశ్ మధ్యన మాట్లాడకుండ ఉంటాననడం పెద్ద ఎగ్రిమెంటే మరి.

* * *

అవి... నేను ఫోర్త్ ఇయర్ మెడిసన్ చదువుతున్న రోజులు. ఫోర్త్ఇయర్‌లో అడుగు పెట్టినది మొదలు క్రొత్త జీవితంలో అడుగుపెట్టినట్లు ఫీలవ్వని మెడికల్ స్టూడెంట్ ఎవ్వరూ ఉండరనుకుంటాను. ఎందుకంటే థర్డ్ ఆయర్ వరకు బియస్సీ క్లాసులలా పీరియడ్స్ జరుగుతుండేవి. మేము ఎలాగ డ్రెస్స్ చేసుకువెళ్ళినా పరవాలేకపోయేది. అక్కడఅంతా అలాగ కాదు. ఎనిమిది గంటలకల్లా నీటుగా అందరూ తయారయ్యేవాళ్లు. గరల్ ఫ్రెండ్స్ కొరకు కాకపోయినా, పేషెంట్స్ దగ్గర డాక్టరుగారన్న భావము తీసుకురావాలని. ఆ భావము కలిగించేందుకు స్టెత్ మెడలో వేసుకునే వాళ్ళం. మొదట్లో క్రొత్తగా అనిపించినా ఎంతో ఉత్సాహపడే వాడ్ని. వార్డ్సులో పేషంట్స్ బాధగా మూలుగుతుంటే చీఫ్ వాండాగా ఒక పేషంటు దగ్గరనుండి మరొక పేషంటు దగ్గరకు వెళుతుండేవారు. ఆయన వెనక అసిస్టెంట్, ప్రొఫెసర్స్ వాళ్ళ వెనక హౌసు సర్జన్స్ వాళ్ళ వెనక ఫైనల్ ఇయర్ స్టూడెంట్స్ అందరికన్నా వెనకగా మేము నడుస్తుంటే, నాకు రైలుబండి గుర్తుకొచ్చేది. పేషంట్సు రోజూ చెప్పుకునే బాధే మళ్ళీ ఏకరువు పెట్టాలని తాపత్రయ పడుతూ చెప్పుతుండగానే, చీఫ్ మందులు ప్రిస్క్రైబ్ చేయడము మరొక పేషంటు దగ్గరకు వెళ్ళడము జరిగేది. మనమేదైనా ఎగ్జిబిషన్‌కు వెళ్ళితే అక్కడ మనకు తెలియని సబ్జక్ట్ గురించికూడా చెప్తారు. మనము మొహమాట పడి అంతా వింటాము. మనము బైటకు వచ్చాక వాళ్ళు చెప్పిందేమిటంటే, బుర్రలో ఏమీ ఉండదు, అలాగే అనిపించింది నాకు. ఆ పేషంట్సుకు జబ్బులు ఏమిటో తెలిసేవి కావు. ప్రిస్క్రైబ్ చేస్తున్న మందుల పేర్లు క్రొత్తగా ఉండేవి. మొత్తానికి ఏమీ తెలియకపోయినా వార్డు అంతా తిరిగి వచ్చేవాళ్ళం. ఇలా కొద్దిరోజుల తరువాత అసిస్టెంటు ప్రొఫెసరు మాకు ప్రత్యేకముగా క్లాసులు తీసుకోవడముతో మాలో ఇంట్రెస్ట్ పెరిగింది.

ఒక రోజు ఆయన క్లాసు తీసుకోవడములో చాలా నిమగ్నమై యున్నారు. పేషంటు బెడ్ చుట్టు మేము నిలబడియున్నాము. అంతలో కళ్లు మిటమిటలాడిస్తూ అప్సరసలాగున్న ఒక అమ్మాయి నెమ్మదిగా మా గుంపు దగ్గరికొచ్చి, నాకు కొంత దూరములో నిలబడింది.

వెనకగా నిలబడ్డ ఆ అమ్మాయి వంక పరీక్షగా చూశాను.

"పచ్చటి ఛాయి, కోలముఖం, బెదురు చూపులు చూసే విశాలమైన కళ్ళూ సన్నటి, పొడుగాటి ముక్కు, ఎర్రటి అందమైన పెదాలు ఎందుకనో ఆమెను అలానే చూడా లనిపించింది. కానీ సభ్యత అడ్డువచ్చి చూపులు మరల్చుకొన్నాను. అయినా నెమ్మదిగా పరిశీలించసాగేను. ఆకు పచ్చరంగు చీర...ఒంటికి అంటుకుపోయినట్టుండే అదే కలరు బ్లౌజు..." అంటూ పరమేశ్ ప్రక్క చూసాను.

ముసిముసి నవ్వులు నవ్వుకుంటు ఆలోచిస్తున్నాడు. హేళన చేస్తున్నాడేమో అనుకొని బుజము తట్టి "వింటున్నావా" అని అడిగాను.

"ఆ..నోరిప్పకుండా చెవులప్పగించి వింటున్నానుగా" అన్నాడు.

"మరి_అయితే ఆ నవ్వు లేమిట్రా?"

"ఏదోలే! క్రొత్తగా పెళ్ళి అయిన వాడ్ని. నీ వర్ణనకు నా భార్య గుర్తుకొస్తుంటే..." అంటు నవిగాడు.

"అయితే ఇక్కడితో ఆపుదామా?"

"లేదు-లేదు. చెప్పు అన్యమనస్కుడిని కాకుండ వింటాను.

"నేనొక్కడ్నే గాక పేషెంట్ చుట్టు యున్నా అందరు స్టూడెంట్స్ ఆమెను చూడడము గమనించిన మా అసిస్టెంట్ ప్రొఫెసర్ ఏమి కావాలమ్మ అని అడిగిన పిలుపుకు అందరము కాస్త తత్తరపాటు చెందేము. ఆమె నెమ్మదిగా కాస్త తగ్గు స్వరముతో "నా పేరు భారతి అండి. గుంటూరు మెడికల్ కాలేజీనుండి ఈ కాలేజికి ట్రాన్స్‌ఫర్‌మీద వచ్చేశాను. నన్ను ఈ బేచ్‌లో కలిపేరని ప్రిన్సిపల్ గారు చెప్పేరు" అంటూ ఎడ్‌మిట్ ఫారం చూపించింది. అది చూసి "ఇవాల్టికి ఇక్కడనుండి విని రేపటినుండి ఈ బేచ్‌తో ఫాలో అవ్వండి" అన్నారు. అలాగేనంటూ కృతజ్ఞతగా ఆమె చూసింది. తరువాత అసిస్టెంట్ ప్రొఫెసర్ చెప్పింది ఎవ్వరికి బుర్రకెక్కలేదు.

మధ్యాహ్నము థీరీ క్లాసుకు ఆమె హాజరయ్యింది. క్లాసులో కోలాహలము బయలుదేరింది. ఆమెను చూసి బ్యూటిఫుల్ గరల్ అంటే, హేమమాలిని ఫేస్‌కట్స్ అని ఎవరికి తోచిన విధముగా వాళ్ళు చర్చిస్తున్నారు. నేను ఎంత వద్దనుకున్నా ఆమె ప్రక్క చూడకుండ వుండలేకపోయాను.

వారం రోజులు గడిచేయి. ఇప్పుడంతగా ఆమె గురించి ఎవరూ మాట్లాడడము లేదు. రోజు వార్డులోకి ఆమె వచ్చిన మొదలు ఎవరితో మాట్లాడేది కాదు. ఎప్పుడు ఆమె ముఖముమీద చిరునవ్వు తాండవమాడేది. మా బేచ్‌లో ప్రియంవద, సంధ్య అని యిద్దరమ్మాయిలు మాత్రమే వుండేవారు. భారతి వచ్చాక ముగ్గురయ్యారు. సంధ్య అందగత్తె కాకపోయిన అందరితోను మంచిగా వుంటుంది. ఎక్కువగా మాట్లాడదు. మగవారు పలుకరిస్తే అడిగిన దానికి సమాధానమిచ్చి ఊరుకుంటుంది. ప్రియంవద, సంధ్య ప్రవర్తనకు వ్యతిరేకముగా ఉంటుంది. సంధ్యకన్నా చాలా అందముగా వుంటుంది. తను అంత అందగత్తెనని గర్వపడుతుంది. కోరి మగవాళ్ళతో పలుకరిస్తుంది.

"వాళ్ళతో నీకు బాగా పరిచయముందా?" అన్నాడు పరమేశ్.

"లేదు... నేనెప్పుడూ ఆడవాళ్ళకు ఎంత దూరంగా వుంటే అంత మంచిదని భావిస్తాను. ఒకటి రెండుసార్లు సంధ్య, నేను సబ్జక్టు విషయమై మాట్లాడుకున్నాము. మా ప్రశ్నలు, సమాధానాలు ముక్తసరిగా వుండేవి. ప్రియంవద అలా కాదు. మొట్టమొదట మనదేవూరండి అంటూ పలకరించింది. ముందాశ్చర్య పడినా తరువాత తేరుకుని, నా వూరు వైజాగ్, మీదేవూరో నాకు తెలీదు అన్నాను.

"కనుక్కోండి చూద్దాం."

"నేను జ్యోతిష్కుడిని కాదుకే మీ వూరేదో చెప్పండుకు, మీరే చెప్పండి" అన్నాను.

చెప్పింది.

"మీరు బాగా సినిమాలు చూస్తారనుకుంటాను" అంది.

"అరే!- ఎలా చెప్పగలుగుతున్నారు. నేను వెళ్ళే ప్రతీ పిక్చరుకు వెనకాల మీరు వస్తున్నారా?" అన్నాను వెటకారంగా.

"చూసారా ఎలా చెప్పేసేనో, మీరెళ్ళే ప్రతీ పిక్చరుకు నేను రావలసిన పనిలేదు. మనిషినిబట్టే చెప్పేయగలను" అన్నది కాస్త గర్వముగా.

"ఆహాహా! సైకాలజీలో దిట్ట అన్నమాట. కానీ ఇప్పుడు మాత్రము పప్పులో కాలేశారు." అన్నాను.

"ఏం! ఎందుకని?"

"నేనెప్పుడు పిక్చర్సుకు వెళ్ళను గనుక, ఎప్పుడైనా వెళితే రెండుమూడు నెలలకోసారి హిందీ పిక్చర్సుకు మాత్రమే వెళ్తాను" అన్నాను, కాస్తగట్టిగానవ్వుతూ. ఏమనుకుందో ఏమో గుసగుసలాడుతూ వెళ్ళిపోయింది. తరువాత రెండుమూడుసార్లు నాతో మాట్లాడేందుకు ప్రయత్నించింది కానీ అవకాశమివ్వలేదు.

ఆ సంఘటన నాకెప్పుడు గుర్తుకొచ్చినా నవ్వుకుంటాను.

ఒకరోజు క్లాసు అయ్యాక నేనొక్కడినే బస్సు కొరకని నడుస్తూన్నాను, నా ముందు ఆడపిల్లలు హైహీల్స్ చెప్పులతో నడుస్తున్నారు. వాళ్ళలా నడుస్తున్నప్పుడు క్రిందకు, పైకి ఎగిరిపడే పిరుదులపై నల్లగా త్రాచుపాము నాట్యము చేస్తున్నట్లు కదలాడే వాళ్ళ నల్లటి జడలు నన్నెంతో ఆకర్షించాయి. వాళ్ళకు వెనుకగా చాలా చేరువగా నెమ్మదిగా నడవసాగేను. వాళ్ళు మాటలాడుకొనే సంభాషణ నాకు స్పష్టంగా వినిపించసాగింది. ఆ నలుగురిలో ప్రియంవద, భారతి మరోఇద్దరు నా క్లాస్‌మెట్స్ వున్నారు.

ప్రియంవద నుద్దేశించి, నీ వలలో పడనివారెవరూ లేరనుకొంటాను అంది ఒక గొంతు. లేకేమి, ప్రభాకర్‌ను కూడా బోల్తా కొట్టించాలని ట్రై చేస్తుంది. కానీ గట్టి ఘటం కదా దీని ఆటలేమీ సాగనివ్వలేదు, అంది రెండవ కంఠము.

నా పేరు వినేసరికి చకితుడనయ్యాను.

ప్రియంవద అహం దెబ్బతింది. వెంటనే అందుకొంది. ఇలాంటి కండూప బ్రహ్మచర్లను ఎంతోమందిని చూసేను. ఇవాళ కాకపోతే రేపన్నా బుట్టలో వేయకపోతానా, చూస్తుండండి త్వరలో నా వెనక పడిగాపులు పడేటట్లు చేస్తాను. అలా చేయలేని పక్షములో నా పేరు మార్చుకొంటాను అంది.

మరింత ఆశ్చర్యపోయాను. వెంటనే అక్కడే నిలిచి పోయాను వాళ్లు హాస్పిటల్ గేటుదాటి పోయేంత వరకు.

"అయితే వనితలలో మహా వనితలు కొంతమంది వున్నారన్నమాట" అన్నాడు పరమేశ్ శాస్త్రి వ్యంగ్యంగా.

"అందుకే నేననవసరముగా ఎవ్వరి జోలికి పోను. ఒకళ్లు ఇష్టాన్ని సంపాదించాలనుకుంటే నా సిద్ధాంతము ప్రకారము నన్ను నేను ప్రేమించుకుంటాను. నన్ను నేను విడుకొని సక్రమమైన మార్గములో పోతే, నాకు తెలియకుండానే నేనెంతోమంది ప్రేమకు గురికాగలననే విశ్వాసము నాకుంది.

ఒకరోజు వార్డులో క్లాసు చాలా ఆలస్యముగా అయ్యింది. మా బేచ్‌లో నాదే ఆఖరుపేరు. కానీ భారతి లేటుగా వచ్చినందువల్ల నా తరువాత నంబరు తనదయ్యింది. ఎటెండెన్స్ తీసుకుంటుండగా ముందుగా పలికినవారు భోజనానికని త్వరత్వరగా వెళ్ళిపోతున్నారు చివరి వరకు నేను, భారతి మాత్రమే మిగిలిపోయాము. మా హాజరు పలికి వెళుతుండగా "ఏమండి" అనే మృదు మధురమైన కంఠము విన్పించింది.

వెంటనే వెనుదిరిగి చూసాను.

భారతి దగ్గరగా వచ్చి "మీరేమీ అనుకోకపోతే మీ నోట్సులు నాకొకసారి ఇవ్వండి" అంది.

"నా...నోట్సులా! ఆశ్చర్యముగా అన్నాను.

"అవునండి, మీ నోట్సులే. నేను లేటుగా జాయిన్ అయ్యాను కదండి. అవింతవరకు నేను రాసుకోలేదు అంది.

"అలాగేనండి, తప్పకుండా ఇస్తానన్నాను.

"థ్యాంక్స్" అంది. నాకు తెలియకుండానే ఆమెతో ఇంకా ఏదన్నా మాట్లాడాలనిపించింది. కానీ ఏమిటో మాటలు దొరకడములేదు. ఆఖరికి ఎలాగయితేనేమి.

"మీరీ కాలేజికి ఎందుకు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారని" అడిగేను.

"మా నాన్నగారికి నేనొక్కత్తెనే కూతురుని. మా ఫాదర్ మొన్నటివరకు గుంటూరులో పనిచేసేరు కానీ, ఈ ఊరు ట్రాన్స్‌ఫర్ అయిపోవడం వలన నన్నుకూడా తప్పనిసరిగా ట్రాన్స్‌ఫర్ మీద ఈ కాలేజిలో జాయిన్ చేశారు" అంది భారతి.

"తల్లి దండ్రుల దగ్గరవుండే అదృష్టవంతులు" అన్నాను.

నవ్వుతూ వెళ్ళిపోయింది.

నేను రూముకు వచ్చిన దగ్గరనుండి నాలో నాకు తెలియని ఉత్సాహము ఆవహించింది. రూములో నోట్సులను ముందేసుకుని కూర్చున్నాను. అంతవరకు అట్టలు వేయని పుస్తకాలన్నింటికి, అందమయిన అట్టలు వేస్తుండగా నాలో చిన్న సందేహాయి కలిగింది. మా క్లాసులో అంతమంది అమ్మాయిలు వుండగా, భారతి నన్నే నోట్సులెందుకడిగిందా అని. నన్ను నోట్సులు అడిగినంత మాత్రాన ప్రేమ అనుకోవడము చాలా తప్పు. ఇలా తర్జన, భర్జన చేసుకొని అట్టలు వేయడము పూర్తి చేశాను. రాత్రి భోజనము చేశాక నోట్సులలో ఎక్కడైనా ఖాళీలు వదిలిన స్థలములు నింపి అప్టుడేట్‌గా తయారుచేసేసరికి రాత్రి పన్నెండు గంటలయింది. బల్లమీద క్రొత్తగా కనిపిస్తున్న నా పుస్తకాలను చూసి నేనే ఆశ్చర్యపోయాను నేనింతవరకు పుస్తకాలపై ఇంత శ్రద్ధ ఎప్పుడూ తీసుకోలేదు. కానీ భారతి అడిగేసరికి ఇంత శ్రద్ధ చూపడముతో ప్రత్యేకత సాకరముకాలేదు. రాత్రి పడుకుంటున్నప్పుడు ఏవో తీయటి ఊహలు నా మదిలోకి తొంగిచూశాయి.

* * *

వార్డులో ఈ రోజుకూడా క్లాసు ఆలస్యము అవుతే బాగుంటుంది. నా దగ్గరవున్న నోట్సులు భారతికి ఎవ్వరు చూడకుండా అందచేయాలి...మనసు పడే తాపత్రయము భగవంతుడు నా మొరాలకించినట్లున్నాడు. క్లాసు వదిలేసరికి చాలా ఆలస్యమయింది. ఎటెన్ డెన్స్ తీసుకోవడము, ఆఖరికి ఇద్దరము మిగిలిపోవడము జరిగింది.

"మీకు ఆకలిగా లేదా? అందరిలా మీరు ఎటెన్ డెన్స్ ఇచ్చి త్వరగా వెళ్ళలేదే" అంది పలకరింపుగా.

"అబ్బే!...మీరు ఒంటరివారయిపోతారని"అన్నాను చలోక్తిగా.

"అహా!...అలా కాకుండా వుండేందుకే గాబోలు కాలేజి వాళ్లు నా పేరు మీ పేరు వెనుక వేశారు" అంది కాస్త కలుపుగోలుగా.

"మీరు చాలా చమత్కారంగా మాట్లాడతారండి" అన్నాను.

"నాకు తెలీదే" అంది.

(సశేషం)